క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ డీఎం'

మిర్యాలగూడ టౌన్ : మిర్యాల డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఈనెల 3న ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డీఎం బొల్లెద్దు పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ డిపో పరిధిలోని ప్రయాణీకులు ఏమైన సలహాలు, సూచనలు, సమస్యలు ఉంటే 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం ద్వారా సెల్ నంబర్‌కు 9959226308కు కాల్ చేయాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని నందిపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని 33కేవీ లేన్ కింద ఉన్న చెట్లను తొలగించే పనిలో భాగంగా నేడు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ అమర్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సబ్‌స్టేషన్ పరిధిలోని చిల్లాపురం తండా, శాంతినగర్, ఐలాపురం, కుంటకిందితండా, వాటర్ ట్యాంక్ తండా, నందిపాడు, రవీంద్రనగర్ గ్రామాలకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ అమర్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ గృహ వినియోగదారులు, వాణిజ్య వినియోగదారులు, రైతులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి సమ్మేళనం

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఎస్పీఆర్ స్కూల్ లో విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి సమ్మేళనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ సంఘం సంయోజకురాలు సత్యావతి, నీలామారెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంతీయ కార్యదర్శి పాండరీనాథ్, జిల్లా విభాగ్ గంజి సుధాకర్, మాతృశక్తి నాయకురాల్లు ఎస్‌సీ పద్మ, శ్రీవాణి, నాంపల్లి రామ్‌కుమార్, చిత్తలూరి శ్రీనివాస్, సత్సంగ్, రాపర్తి శ్రీనివాస్, నాగరాజు, పొలయాదయ్య తదితరులున్నారు.

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వేములపల్లి : మండల పరిధిలోని ఆమనగల్లు గ్రామంలోని శ్రీ పార్వతీ రామలింగేశ్వరస్వామి జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినందుకు ఎస్ఐ డి.విజయ్‌కుమార్‌ను ఆలయ కమిటీ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ వెంకన్న, నాయకులు సందీప్‌నాయుడు, పత్తిపాటి వినయ్, అవిరెండ్ల సతీష్, పెరుమాళ్ల జోజి, వాకిటి ఎల్లయ్య, లింగారెడ్డి, గంట కృష్ణయ్య, పెరపాక సతీష్, గంగయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సేవా దృక్పథం కలిగిఉండాలి



అన్నదానం చేస్తున్న శివలీలారెడ్డి

నల్లగొండటౌన్ : ప్రతిఒక్కరూ సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలని న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ చైర్మన్ శివలీలారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్లాక్‌టవర్ సమీపంలో నిరాశ్రయులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పుడమి సాహితీ వేదిక వ్యవస్థాపకుడు చిలుముల బాల్‌రెడ్డి, సమాచార హక్కు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బండమీది అంజయ్య, బండమీది పరమేశ్వరి, ఆర్ఎంపీ డాక్టర్లు, సామాజిక సేవ కర్తలు దాసోజు కృష్ణమాచారి, భిక్షాల మహేష్, బడుగుల శ్రీనివాస్, తలారి ప్రవీణ్, లక్ష్మి, వెంకటేశ్వర్లరెడ్డి, కాశీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు శాశ్వత పట్టాలను ఇవ్వాలని కోరుతూ శుక్రవారం సూర్యాపేటలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి సీపీఐఎంఎల్ ప్రజా పంథా ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడారు. గత ఏడేళ్లుగా ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అనేక పోరాటాలు చేసినా గత పాలకులు పట్టించుకోలేదని అన్నారు. అంతేకాకుండా అక్రమ కేసులను బనాయించారని తెలిపారు. ఇప్పటికైనా పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని ఆ పత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ముప్పారం యూటీ



యూటీపై వాహనాల రాకపోకల కోసం నిర్మాణం చేసిన బ్రిడ్జి



యూటీ వద్ద ఇసుక అక్రమ రవాణా చేసే దారి

నిడమనూరు : మండలంలోని ముప్పారం అంగర్ టన్నెల్(యూటీ) వద్ద ఇసుక అక్రమ రవాణ, వాహనాల రాకపోకలతో ప్రమాదకరంగా మారింది. సాగర్ ఎడమకాల్వ కోసం వాగుపై యూటీ నిర్మాణం చేశారు. ఈ వాగు నుంచి వరద నీరు నిడమనూరు చెరువులోకి వస్తాయి. పైన సాగర్ కెనాల్ లో సాగునీరు నల్గొండ, ఖమ్మం జిల్లా పాలేరు వరకు వెళ్తాయి. కట్టమీదుగా వాహనాల రోకపోకలు సైతం సాగుతాయి. గత ఖరీఫ్ సీజన్, రబీ సీజన్‌లలో సాగునీరు విడుదల లేకపోవడం, వర్షాలు సైతం లేకపోవడంతో వాగులో నీరు లేకుండా పోయింది. దీంతో వాగులోని ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటన్నారు కొందరు అక్రమార్కులు. యూటీ ఖానాల మధ్య సైతం ఇసుకను తరలిస్తున్నారు. యూటీపైన వాహనాలు అధికంగా రాకపోకలు సాగిస్తుండడంతో అది దెబ్బతింటున్నది. రైతులు పొలాల వద్ద అవసరాల కోసం ఏర్పాటు చేసిన దానిపై ఎక్కువ సంఖ్యలో అధిక లోడుతో వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల దానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉన్నది. అనుముల మండలం నుంచి కూడా వాహనాలు దొంగదారిన ఇదే యూటీపై నుంచి వెళ్తున్నాయి. అధికారులు యూటీని సందర్శించి ప్రమాదం జరుగక ముందే అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేసి, సరైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి



యూటీ ఖానాల మధ్య దెబ్బతిన్న సీసీ బెడ్

కన్నుల పండువగా రథోత్సవం



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి : మండల పరిధిలోని వెంకటంపేట గ్రామంలో కొలువుదీరిన శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులే కాక చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. అనంతరం గ్రామంలో హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాయితి జితేందర్‌రెడ్డి, దాసరి శ్రీనివాస్‌యాదవ్, ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, జాన్‌యాదవ్, ఆలంపల్లి నర్సింహా, అంగిరేకుల నాగభూషణం, ధరణిపతి రమణారావు, కొరివి యాదగిరి, కృష్ణమాచారి, గోవర్ధన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్ ఆవిష్కరణ



విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గుర్రంపోడు : కొప్పోలులోని బుగ్గరామలింగేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ పార్వతీదేవీ, నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్‌లను శుక్రవారం దేవాస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏప్రిల్ 15న నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన, బొడ్రాయి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎంపీటీసీ ఆవుల వెంకన్న, మాజీ సర్పంచ్ జ్యోతి లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ శంకర్ గౌడ్, బల్గూరి నగేష్, కస్తూరి సురేష్, రవికుమార్, బొమ్ము శ్రీనివాస్ ,వెంకన్న, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేస్తున్న కమిషనర్

దేవరకొండ : పట్టణ ప్రజలు సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో సిబ్బందితో కలిసి ఆయన ఆస్తి పన్ను వసూలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొండి బకాయిదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ బకాయిలు చెల్లించని యజమానులపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పన్నుల బకాయిలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. బకాయిల చెల్లింపునకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. వంద శాతం పన్నుల వసూలు లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అందరికీ అనుసరణీయం



మిర్యాలగూడ : ఉట్లపల్లి చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ టౌన్: ఏసు శిలువతో బయటకు వస్తున్న పాస్టర్ ధీరావత్ హన్యానాయక్

మిర్యాలగూడ : ఏసుక్రీస్తు బోధనలు అందరికి అనుసరణీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా మిర్యాలగూడ మండలంలోని ఉట్లపల్లి గ్రామంలో పరిశుద్ధాత్మ అగ్ని మినస్ట్రీస్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

దుబ్బతండాలో..

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని దుబ్బతండాలోని విశ్వస పరిచర్య ప్రార్థన మందిరం పాస్టర్ ధీరావత్ హన్యానాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా గుడ్ ఫ్రైడే సందర్భంగా 72గంటల ఉపవాస దీక్షల ముగింపుతో పాటు ఈ స్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రార్థన మందిరం నుంచి శిలువతో ఈ ప్రాంతంలో ప్రదర్శించి ఉపవాస ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాస్టర్ హన్యానాయక్ ఏసు క్రీస్తు శిలువపై ప్రాణ త్యాగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రమాబాయి, శ్రీనివాస్, పంతుజా, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, మధనాచారి, ఏడుకొండలు, సులోచన, మంగమ్మ, పాపయ్య, కోటయ్య పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ సభ్యుల ఎన్నిక

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయసాయ చంద్రమౌళీశ్వర దేవాలయంలో శ్రీ రామనవమి పండుగను పురస్కరించుకొని దేవాలయ మాజీ కార్యదర్శి నీలా లక్ష్మయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఉత్సవ కమిటీని పస్నూరి యుగేందర్‌రెడ్డి, మైల బుచ్చిరెడ్డి, నీల లక్ష్మయ్యలను ఎన్నుకున్నారు. ఏప్రిల్ 17న శ్రీరామ నవమి పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 18న నల్లగొండ రోడ్డులోని పాత ఊరులో గల అభయాంజనేయస్వామి దేవాలయం నుండి రథోత్సవం(తేరు) లాగే కార్యక్రమంలో ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలి

మిర్యాలగూడ : ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడానికి టెట్ ఉత్తీర్ణులు కావాలనే నిబంధనను ప్రభుత్వం తొలగించాలని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్ నాయక్ కోరారు. శుక్రవారం బంజారా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని అర్హతల అనంతరం డీఎస్సీ రాసి మెరిట్ వచ్చిన వారినే ఉపాధ్యాయులుగా నియమించారని గుర్తు చేశారు. మరోవైపు ఉపాధ్యాయులు పదోన్నతి పొందడానికిత జీఓ టెస్ట్, ఈఓ టెస్టులు ఉన్నాయని వాటి ఆధారంగానే పదోన్నతులు ఇస్తున్నారని మధ్యలో టెట్ పాస్ కావాలనే నిబంధనతో ఉపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి టెట్‌తో సంబంధం లేకుండా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పుడో 20- 25ఏళ్ల కిందట ఎంపికైన ఉపాధ్యాయులు ప్రస్తుతం టెట్ అర్హత సాధించడం అసాధ్యమన్నారు. కొత్తకొత్త నిబంధనల పేరుతో ఉపాధ్యాయులకు పదోన్నతులు రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. ఎన్‌సీఈఆర్టీ, ఎస్‌సీఈఆర్టీ ఈ విషయమై సమగ్ర చర్చలు జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని, తద్వారా ఉపాధ్యాయ పదోన్నతులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు మక్ల నాయక్, శ్రీనునాయక్, లాలునాయక్, దేవి, కోట్యా, సైదా, జమ్ల తదితరులు పాల్గొన్నారు.

టీఎంసీ సభ్యులకు సన్మానం

నల్లగొండ టౌన్ : తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో గెలిచిన టీఎస్ఎంసీ సభ్యులను శుక్రవారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన్‌లో సంఘం ప్రెసిడెంట్ అనిత అధ్యక్షతన సన్మానించారు. టీఎస్ఎంసీ సభ్యులైన డాక్టర్లు శ్రీనివాస్, నరేష్, శ్రీకాంత్ జూకూర్, విష్ణులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు సీహెచ్. పుల్లారావు, రమేష్, విజయ్, రాజేశ్వరి, సుచరిత, సుబ్బారావు, దైవాదీనం, సుధాకర్, వినోద్, విశ్వజ్యోతి, సంతోష్, శశిధర్, ప్రశాంత్, హరికృష్ణ, రితేష్, శశాంక, గణేష్, హరీష్, రామ్‌మనోహర్, వినయ్, చైతన్య పాల్గొన్నారు.



టీఎంసీ సభ్యులను సన్మానిస్తున్న డాక్టర్లు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

చింతపల్లి : మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర నగర్ కొండపై కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా కొనసాగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వస్తిపుణ్యవచనము, లక్ష్మీనరసింహస్వామి హోమం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు మాల్ పరిసర ప్రాంత ప్రజలు హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండూరు భవాని పవన్‌కుమార్, మాజీ సర్పంచ్ అంగిరేకుల విజయగోవర్ధన్, ఆలయ కమిటి చైర్మన్ ఊరె లక్ష్మణ్, ధర్మకర్తలు కృష్ణగౌడ్, ఆంజనేయులు, జంగయ్య, నారాయణచారి, భాస్కర్, గోపి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

రఘువీర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మిర్యాలగూడ : మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న గౌనీ రాజా రమేష్ యాదవ్

మిర్యాలగూడ : నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిపై తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని టీపీసీసీ రాష్ట్ర నాయకులు పగిడి రామలింగయ్యయాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగ్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గాదరి కిశోర్‌కుమారుకు తుంగతుర్తి ప్రజలు బుద్ధి చెప్పినా సరిపోలేదని ఇంకోసారి కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాగార్జున, షేక్ ఇమ్రాన్, జల్లా వెంకటేశ్వర్లు, ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

హాలియా : తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనకి తీసుకొని తక్షణమే క్షమాపణ చెప్పాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడ గౌనీ రాజారమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సాగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు, సీనియర్ నాయకులు రంగారెడ్డి, నకిరేకంటి సైదులు, అజ్జు, నరసింహ, రాజశేఖర్, నాగరాజు, మహేష్, శ్రీకాంత్, సాగర్, వినోద్ పాల్గొన్నారు.

అహంకారపూరిత మాటలు మానుకోవాలి

హాలియా : నల్లగొండ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డిపై బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ అహంకార పూరితంగా మాట్లాడడం తగదని ఏకే ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుందూరు రఘువీర్‌రెడ్డిది గాదరి కిశోర్ లాగా దొంగ నోట్ల మార్పిడి చేసిన చరిత్ర కాదని అవినీతి మచ్చలేని సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న కుందూరు జానారెడ్డి తనయుడన్నారు. కాంగ్రెస్ పార్టీపైన, కాంగ్రెస్ పార్టీ నాయకులపైన అసత్యపు అహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలే గాదరి కిశోర్‌ను ఊర్లలో అడుగుపెట్టనీయరని, సామాన్య ప్రజలే ఆయనపై తిరుగుబాటు చేయడం ఖాయమన్నారు.

సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ : మఠంపల్లి మండలం మట్టపల్లిలో శనివారం నిర్వహించబోయే నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ బూత్ కమిటీ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి ఏఐసీసీ ఇన్‌చార్జ్, ఏఐసీసీ సెక్రటరీ, మంత్రులు తదితరులు హాజరు అవుతున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సాముల శివారెడ్డి, గూడెపు శ్రీనివాస్, గెల్లి రవి, కోతి సంపత్‌రెడ్డి, మల్లయ్య, పాల్గొన్నారు.

పెట్రోలియం డీలర్లకు కమీషన్ పెంచాలి



నిరసన వ్యక్తం చేస్తున్న పెట్రోలియం డీలర్లు

నకిరేకల్ : పెట్రోలియం డీలర్లకు కమీషన్ పెంచాలని డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దైద రవీందర్ కోరారు. పెట్రోలియం డీలర్లకు ఏడు ఏళ్లుగా కమీషన్ పెంచలేదని, ఈఏడాదైనా కమీషన్ పెంచాలని కోరుతూ పట్టణంలోపెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న ధరలకనుణంగా పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న ఆపరేటర్లకు సరైన వేతనాలు ఇవ్వలేక పోతున్నామన్నారు. విద్యుత్ చార్జీలు రెట్టింపు అవుతున్నాయన్నారు. వెంటనే పెట్రోల్‌పై కమీషన్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్వకుంట్ల విజయ్‌కుమార్, సంఘం ప్రతినిధులు రావుమిట్ట పూర్ణచందర్‌రెడ్డి, జయం శ్రీనివాస్, వేమవరపు నర్సింహులు, బడుగుల నరేందర్, గజ్జెల శ్రీనివాస్, భాస్కర్, విజయలక్ష్మి, తేలు నాగయ్య, ఆకుల నాగయ్య, విక్రమ్, శివ, రమేష్, కోత్తురు వేంకటేశ్వరావు, రాంమోహన్, సుదీర్, సనీల్, లక్ష్మారెడ్డి, నరేష్, వెంకట్‌రెడ్డి, షేక్ సైదా, వేణు, లక్ష్మీనర్సయ్య, శంకర్, శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలంలోని సిలార్‌మియాగూడెంలో శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లగొండ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి పాల్గొని జలాధివాసం, ధన్యాదివాసం, హవనం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, మెరుగు గోపి, సింగిల్ విండో వైస్ చైర్మన్ కందుల రేణుకలక్ష్మయ్య, ఎంపీటీసీ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



దర్గాకు గంధాన్ని తీసుకెళ్తున్న భక్తులు

డిండి : మండల కేంద్రంలోని శ్రీ హజ్రత్ ఖాజాయే ఖాజ్‌ఘా ఖాజా మోయినొద్దిన్‌హసన్ సంజరి గరీబ్ నవాజ్(అజ్మీర్ దర్గా), శ్రీ హజ్రత్ ఖాజా సయ్యద్ షా అమీరొద్దిన్ చిష్తి మిర్జాయి ఖలందరి దర్గా 75వ ఉర్సు గంధోత్సవాన్ని శిష్య బృందం శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బల్మూరి సైదులు ఇంటి నుండి బయలుదేరిన గంధం స్థానిక మహబూబ్ సుహానీ దర్గా వద్ద పాతిహాలు నిర్వహించిన అనంతరం దర్గా వద్దకు చేరుకుంది. స్వామి వారికి దట్టీలు, పూలచాదర్‌లు కప్పి మాలీదా సమర్పించి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. కుల మతాలకతీతంగా ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో దర్గా ఆవరణం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు దర్గా ఆవరణలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా పీఠాధిపతులు సయ్యద్ షుర్భొద్దీన్, సైదులు, చాంద్‌పాషా, అంజి, శ్రీధర్, బాబా, చంద్రయ్య, మల్లయ్య, నారయ్య, టి.సైదులు, బాలస్వామి, వెంకట్‌రెడ్డి, కర్నాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

బీసీ కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా రవి

నల్లగొండ రూరల్ : మండలంలోని ఖాజీరామారం గ్రామానికి చెందిన పాలకూరి రవిగౌడ్ బీసీ కులసంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహయాదవ్ శుక్రవారం హైదరాబాద్‌లో నియామకపత్రం అందజేశారు. జిల్లాలో బీసీల సమస్యల పట్ల వారి ఆర్థిక అభ్యున్నతికి తనవంతుగా కృషి చేస్తానని రవి తెలిపారు. బీసీల ఆర్థిక బలోపేతానికి ఓటును అమ్ముకోవద్దని, ఓటు హక్కు ద్వారానే రాజ్యాధికారంలో రాణిస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి రవి కృతజ్ఞతలు తెలిపారు.



నియామక పత్రం అందుకుంటున్న రవి